Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

గురువారం
8 ఆగస్టు 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 95
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar


## రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 స్థానాలకు ఈ ఉప ఎన్నికలు
- అస్సాం, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నికలు
- నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీని చివరి తేదీ
- సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం పోలింగ్ సాయంత్రం ఫలితాలు




## దేశ వనరులు వృథా అవుతున్నాయి..



- బంగ్లా అల్లర్లపై మాజీ ప్రధాని ఖలీదా జియా ఆవేదన!
- మంగళవారం గృహనిర్బంధం నుంచి విడుదలైన ఖలీదా జియా
- బంగ్లాదేశ్ ఖిలాఫత్ మజ్లిస్ ప్రధాన కార్యదర్శి మౌలానా మమునుల్ హక్‌తో భేటీ
- దేశంలో జరుగుతున్న హింసాకాండపై ఆందోళన

## నీటిపారుదల రంగంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నీటి పారుదల శాఖ మంత్రి కుమార్ రెడ్డి చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, జల వనరులు, నది అభివృద్ధి గంగా పునరుజ్జీవన శాఖ, జాతీయ ఫ్రేమ్‌వర్క్‌ను స్వీకరించడం, మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహణ కోసం జాతీయ ఫ్రేమ్ వర్క్‌పై పద్ధతులు, మార్గదర్శకాలను అధ్యయనం చేయడానికి, సిఫారసు చేయడానికి ఈ కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం - మిగతా3లో

# రైతన్నకు గడువు!

- 2 లక్షలకు పైనున్న అప్పు చెల్లించేందుకు 4-6 నెలల సమయం
- రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం యోచన
- గంపగుత్తగా కాకుండా ఎవరు చెల్లిస్తే వారికే రూ.2 లక్షల మాఫీ
- మూడో విడతలో 6 లక్షల మందికి..
- రూ.6 వేల కోట్ల నిధులు సర్దుబాటు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

రెండు లక్షల రూపాయలకు పైగా పంట రుణ బకాయిలున్న రైతులకు.. ఆ పైనున్న మొత్తాన్ని చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన గడువు విధించాలనే యోచనలో ఉంది. పంద్రాగస్టు వరకు మూడో విడత రుణమాఫీ పూర్తయిన తర్వాత.. రూ.2 లక్షలకు పైనున్న విభాగంలోని రైతులపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశాలున్నాయి. రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతుల వివరాలను ప్రకటించి.. రూ.2 లక్షల కంటే ఎక్కువగా - మిగతా3లో



## లక్షల సంఖ్యలో రైతులతో సభ..

- సీఎం రేవంత్ చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం: ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఉమ్మడి ఖమ్మం రైతుల కల త్వరలో నెరవేరబోతోంది

**శుభ తెలంగాణ హైదరాబాద్**

ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆగస్టు 15న ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో కలిసి ఆయన నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ను ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు - మిగతా3లో

## విపక్ష ఇండియా నేతలతో ఉద్ధవ్ థాక్రే భేటీ



- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సీట్ల సర్దుబాటు, ప్రచారాంశాలపై చర్చ
- ముంబైలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటికే సమాయాత్తమయ్యాయి
- లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మెరుగైన ఫలితాలు సాధించిన అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉద్ధవ్ థాక్రే తొలిసారి ఢిల్లీ పర్యటన



## మన తెలంగాణ బిడ్డ.. మనకు నాన్ లోకల్ అవుతున్నడు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల మన తెలంగాణ బిడ్డ.. మనకు నాన్ లోకల్ అవుతున్నాడు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మెడికల్ అడ్మిషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో - మిగతా3లో

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్
- మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం గుడ్డెద్దు చేనేలో పడ్డట్టు ఉంది
- రాష్ట్ర భవిష్యత్‌ను, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఆలోచన లేకుండా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తుంది.
- 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రిజర్వేషన్లు సాధించాం..



## వినేశ్ కోసం ఎన్నో ప్రయత్నాలు.. లక్షల్లో ఖర్చు

- వెల్లడించిన కేంద్రమంత్రి.. విపక్షాల వాకౌట్..
- రెజ్లర్ వినేశ్ అనర్హతపై అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ ముందు తీవ్ర నిరసన
- నేష్ ఫోగట్‌కు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాం
- ఫైనల్స్‌కు కొన్ని గంటల ముందు ఓ చేదు వార్త బయటకురావడంతో భారతీయులంతా నిరాశ

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు

- తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం
- దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి.
- 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది
- ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైన, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలి. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించారు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ దాటుకొని 24 ఏండ్ల పాటు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాము అని కేటీఆర్ తెలిపారు. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా - మిగతా3లో



## కోల్‌కతాపై బంగ్లాదేశ్ అశాంతి ప్రభావం

- 15 రోజులుగా వ్యాపారాలు బంద్
- సుమారు 500 మంది వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.
- సాధారణంగా కోల్‌కతాకు వచ్చే చాలా మంది బంగ్లాదేశీయులు నగరంలోని మార్క్వెస్ స్ట్రీట్, క్రైడ్ స్ట్రీట్, ఎస్ప్లానేడ్, న్యూమార్కెట్ ప్రాంతాల్లో నివసిస్తుంటారు.
- కోల్‌కతాలోని విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాలు, ట్రావెల్ ఏజెన్సీల దారుణ పరిస్థితి

# ఫోగట్ అనర్హతపై రాజకీయ దుమారం!



భారత మహిళా రెజ్లర్ వినేష్ ఫోగట్‌పై పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటు పడటంపై దేశంలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ విషయంపై కేంద్రప్రభుత్వాన్ని ఇండియా కూటమి పక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. వినేష్ అనర్హతపై విపక్షాలు పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. మరోవైపు సోషల్ మీడియాలో సైతం కొందరు కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. వినేష్ ఫోగట్ ఫైనల్ ఆడకపోవడం వెనుక కుట్ర ఉందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ కోరారు. కేంద్రప్రభుత్వం, రెజ్లింగ్ ఫెడరేషన్ చేసిన కుట్రగా రైతు నాయకుడు రాకేష్ టికాయిత్ ఆరోపించారు. వినేష్ ఫోగట్‌తో ఉన్నవారందరినీ విచారించాలన్నారు.

**ఫెడరేషన్ రియాక్షన్..**

వినేష్ ఫోగట్ పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్స్ ఆడలేకపోవడం ఎంతో బాధాకరమని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేర్కొంది. కుట్ర కోణంపై ప్రస్తుతానికి ఏమి చెప్పలేమన్నారు. దీని వెనుక కేంద్రప్రభుత్వానికి, ఫెడరేషన్ ప్రమేయం లేదన్నారు. వినేష్‌పై అనర్హత దేశానికి జరిగిన నష్టంగా ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ అంశానికి రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని, దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదని ఫెడరేషన్ నాయకులు తెలిపారు.

**అనర్హతకు కారణమిదే..**

పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి వినేష్ ఫోగట్ ఫైనల్స్ చేరింది. మంగళవారం రాత్రి జరిగిన సెమీఫైనల్స్‌లో క్యూబా క్రీడాకారిణిపై విజయం సాధించడంతో ఆమె భారత్‌కు పతకాన్ని ఖాయం చేసింది. ఫైనల్స్‌లో గెలిచి స్వర్ణం సాధిస్తుందనుకుంటున్న సమయంలో 50 కిలోల కంటే 150 గ్రాముల బరువు ఎక్కువగా ఉండటంతో ఆమెపై ఒలింపిక్స్ కమిటీ అనర్హత వేసిందన్న వార్త బయటకు వచ్చింది. ఒలింపిక్ నింబధనల ప్రకారం రెజ్లర్లకు తాము ఆడుతున్న కేటగిరీ నుంచి 100 గ్రాముల వరకు మినహాయింపు పొందే అవకాశం ఉంటుంది. దీంతో 50 కేజీలకంటే 100 గ్రాముల వరకు అదనంగా బరువు ఉండొచ్చు. కానీ 150 గ్రాములు ఉండటంతో ఆమె ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. నాడు న్యాయం కోసం నేడు దేశం కోసం

**రాజకీయ దుమారం**

బరువు ఎక్కువగా ఉండటంతో వినేష్ ఫోగట్ ఫైనల్స్ ఆడలేకపోతున్నారంటూ వినేస్ ఫోగట్ తండ్రి ప్రకటించడంతో ఒకసారి ఈ అంశంపై రాజకీయ దుమారం చెలరేగింది. అనర్హత పడటం వెనుక కుట్ర ఉందని వినేష్ బంధువు రాజ్‌పాల్ రాఠీ తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే పార్లమెంట్‌లో వినేష్ ఫోగట్ అనర్హత అంశంపై దుమారం రేగింది. ప్రతిపక్షం నుంచి పప్పు యాదవ్, చంద్రశేఖర్, అసదుద్దీన్ ఒవైసీ, హరేంద్ర మాలిక్‌లు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వినేష్‌ను కావాలని టార్గెట్ చేశారంటూ ఎంపీలు ఆరోపించారు. మొత్తం ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండాలని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ కోరారు. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించాలని సమాజ్‌వాదీ అధినేత అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. వినేష్ ఫోగట్ ఫైనల్‌లో ఆడలేకపోవడానికి గల సాంకేతిక కారణాలపై చర్చించి లోతుగా విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని అఖిలేష్ యాదవ్ కోరారు.

# వినేష్ కోసం ఎన్నో ప్రయత్నాలు.. లక్షల్లో ఖర్చు..




పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైన రెజ్లర్ వినేష్ ఫోగట్ అంశంపై కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా పార్లమెంట్‌లో స్పందించారు. రెజ్లర్ వినేష్ అనర్హతపై అంతర్జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ ముందు తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. రెండుసార్లు బరువు కొలిచినప్పుడు ఆమె 50.100 కిలోలుగా తేలిందని క్రీడా మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ వినేష్ ఫోగట్ అంశానికి సంబంధించి భారత ఒలింపిక్ సంఘం చీఫ్ పిటి ఉషతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. వినేష్ ఫోగట్‌కు అన్ని రకాల సహాయ సహకారాలు అందించామని ఒలింపిక్ సంఘం తెలిపినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఆమె కోసం 70.45 లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వినేష్ ఫోగట్ రెజ్లింగ్ మహిళల 50 కేజీల విభాగంలో మంగళవారం జరిగిన సెమీఫైనల్స్‌లో క్యూబా క్రీడాకారిణి ఓడించి ఫైనల్స్‌కు చేరింది. అంతకుముందు టోక్యో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత సుసాకిని ఓడించి చరిత్ర సృష్టించింది. ఫైనల్స్‌కు కొన్ని గంటల ముందు ఓ చేదు వార్త బయటకురావడంతో భారతీయులంతా నిరాశ చెందారు. వినేష్ ఫోగట్ బరువు ఎక్కువగా ఉన్నారని తేలడంతో ఒలింపిక్స్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడంతో విశ్వ క్రీడల నుంచి ఆమె నిష్క్రమించాల్సి వచ్చింది.

**రెండు సార్లు పరీక్షలు..**

రెజ్లింగ్‌లో తలపడే క్రీడాకారులకు ప్రతి రోజు ఉదయం బరువును పరీక్షిస్తారని.. ఆ పరీక్షల్లో బరువు అధికంగా ఉన్నట్లు తేలడంతో వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు పడినట్లు కేంద్ర క్రీడల శాఖ మంత్రి తెలిపారు. 50 కిలోల విభాగంలో ఆమెను అనర్హురాలిగా ప్రకటించినట్లు చెప్పారు. ఉండాల్సిన బరువుకంటే 100 గ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారన్నారు. తన బరువును నిరూపించుకోవడంలో విఫలమైనా, బరువు పరీక్షకు ఆటగాడు హాజరుకాకపోయినా అతడిపై అనర్హత వేటు వేయడంతో పాటు.. ర్యాంకుల జాబితాలో దిగువకు చేరుస్తారని ఒలింపిక్ నిబంధనలు పేర్కొంటున్నాయని.. దీని ప్రకారం వినేష్ ఫోగట్ ఫైనల్స్ ఆడలేకపోతున్నట్లు తెలిపారు. వినేష్ ఫోగట్‌క ప్రభుత్వం అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తోందన్నారు. తనకు క్రీడా సౌకర్యాలు కల్పించడంతో పాటు, అవసరమైన శిక్షణ ఇప్పించినట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. పారిస్ ఒలింపిక్స్‌లో వినేష్ కోసం రూ.70,45,775 ఖర్చు చేసినట్లు తెలిపారు.

**నాడు న్యాయం కోసం నేడు దేశం కోసం**

**విపక్షాల ఆగ్రహం..**

కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియా ప్రకటనపై విపక్షాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఆమెపై అనర్హత వేటు పడిందని, తక్షణమే దీనిపై విచారణ చేయించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్రమంత్రి ప్రకటనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి.

## వినేష్ ఫాగాట్‌పై అనర్హత దేశానికి నష్టం ఎంపీ కరణ్ భూషణ్




పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. రెజ్లింగ్ ఫైనల్‌కు చేరిన భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పతకం ఆశలు ఆవిరయ్యాయి. అధిక బరువు కారణంగా ఆమెపై అనర్హత వేటు పడింది. నంబర్ వన్ రెజ్లర్ సుసాకిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరిన ఫొగాట్‌పై అనర్హత వేటు పడటం సర్వత్రా షాక్‌కు గురి చేస్తోంది. వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు దేశానికి నష్టమని బీజేపీ ఎంపీ కరణ్ భూషణ్ సింగ్ అభివర్ణించారు. ఫెడరేషన్ ఈ విషయం పరిశీలించి ఏం చేయాలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇక వినేష్ ఫొగాట్‌పై అనర్హత విచారకరమని ప్రధాని నరేంద్ర మోదీ అంతకుముందు ట్వీట్ చేశారు. వినేష్ మీరు ఛాంపియన్లకే ఛాంపియన్, భాతర్‌కు గర్వకారణం, ప్రతి ఒక్క భారతీయుడికి స్ఫూర్తిదాయకమని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సవాళ్లకు దీటుగా మీరు మరింత గట్టిగా ముందుకొస్తారని తమకు తెలుసని పేర్కొన్నారు. మరోవైపు ఫొగాట్‌పై అనర్హత అంశంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు వార్త నిజం కాకుంటే బాగుండు అంటూ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'నోనోనో.. ఇది ఓ పీడకల అయితే బాగుండు..' అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

# దేశ వనరులు వృథా అవుతున్నాయి

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఆ దేశ నేషనలిస్ట్ పార్టీ అధినేత్రి, మాజీ ప్రధాని ఖలీదా జియా ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గృహనిర్బంధం నుంచి విడుదలైన ఖలీదా.. బంగ్లాదేశ్ ఖిలాఫత్ మజ్లీస్ ప్రధాన కార్యదర్శి మౌలానా మమునుల్ హక్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ వనరులు వృథా అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేసినట్లు ఢాకా ట్రిబ్యూన్ వెల్లడించింది. మన దేశ వనరులు వృథా అవుతున్నాయి. 'ఈ దేశం మనది, ఈ దేశాన్ని మనం నిర్మించుకోవాలి' అని ఆమె అన్నారు. దేశాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు హాని తలపెట్టడమే కాకుండా ఆస్తులను ధ్వంసం చేయటం తీవ్రమైన విషయమని ఖలీదా జియా పేర్కొన్నారు. దేశ వనరులను కొల్లగొట్టడంలో చాలా మంది ప్రమేయం ఉందని, ఇది అన్యాయమని ఆమె పేర్కొన్నట్లు ఢాకా ట్రిబ్యూన్ తెలిపింది. కాగా, ఆగస్టు 6న బంగ్లాదేశ్ అధ్యక్షుడు షహబుద్దీన్ అహ్మద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 49 ప్రకారం బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా జైలు శిక్షను తగ్గించి, విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో ఆమె నిన్న విడుదలైన తర్వాత పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆమె మౌలానా మామునుల్ హక్ తండ్రి దివంగత షేఖుల్ హదీస్ అజీజుల్ హక్‌తో తనకున్న మంచి సంబంధాన్ని గుర్తుచేసుకున్నారని ఢాకా ట్రిబ్యూన్ పేర్కొంది. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు హాని కలిగించడం తీవ్రమైన సంఘటన అని ఖలీదా జియా పేర్కొన్నారు.

# ఢిల్లీ ఎల్జీకి సీఎం కేజ్రీవాల్ లేఖ

**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15 వేడుకల్లో జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మంత్రి అతిషికి అనుమతి ఇవ్వాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి కె సక్సెనాను సీఎం అరవింద్ కేజ్రీవాల్ కోరారు. అందుకోసం ఢిల్లీ ఎల్జీ వికె సక్సెనాకు బుధవారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రతి ఏడాది ఆగస్ట్ 15వ తేదీన ఛత్రసాల్ స్టేడియం వేదికగా కేజ్రీవాల్ ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంది. అయితే ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. నాటి నుంచి ఆయన తీహాడ్ జైలుల్లోనే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ.. తాను ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాని సుప్రీంకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎన్నికల ప్రచారం పూర్తికాగానే సీఎం కేజ్రీవాల్ మళ్లీ జైల్లోకి వెళ్లిపోయారు. నాటి నుంచి ఆయన తీహాడ్ జైల్లోనే ఉన్నారు. మరోవైపు ఇదే కేసులో ఇటీవల స్థానిక కోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసింది. దాంతో ఆయన విడులవుతారని అంతా భావించారు. కానీ ఇదే కేసులో ఆయన్ని సీబీఐ సైతం అరెస్ట్ చేసింది. దీంతో బెయిల్ వచ్చినా.. బయటకు రాలేని పరిస్థితిలో అరవింద్ కేజ్రీవాల్ జైల్‌లోనే ఉండిపోయారు. బెయిల్ కోసం ఆయన ప్రస్తుతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ ఆయనకు బెయిల్ రాని పరిస్థితి నెలకొంది. అలాంటి పరిస్థితుల్లో ఆగస్ట్ 15వ తేదీ జెండా వందన కార్యక్రమం ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సీఎం కేజ్రీవాల్ ప్రతీ ఏటా హాజరవుతు వస్తున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఇక ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సైతం తీహాడ్ జైల్లోనే ఉన్నారు. ఆయన సైతం ఇదే కేసులో అరెస్టయ్యారు. అలాంటి పరిస్థితుల్లో మరో వారం రోజుల్లో జెండా పండగ వేడుకల్లో ఎవరు పాల్గొంటారంటూ ఓ చర్చ సైతం మొదలైంది. ఆ క్రమంలో మంత్రి అతిషి పేరును పార్టీలోని నేతలు తెరపైకి తీసుకు వచ్చినట్లు సమాచారం. అదీకాక ప్రభుత్వ పరంగా ఏమైనా నిర్ణయాలు వెల్లడించాల్సి ఉన్నా.. మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరగాలన్నా అతిషి ముందుంటారనే విషయం అందరికి తెలిసిందే. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ వేళ.. త్రివర్ణ పతాకం ఎగుర వేసే బాధ్యతలు ఆమెకు అప్పగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మరి దీనిపై ఢిల్లీ ఎల్జీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎదురు చూస్తుంది.

## విపక్ష ఇండియా నేతలతో ఉద్ధవ్ ఠాక్రే భేటీ



మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తన కుమారుడు ఆదిత్యా ఠాక్రేతో కలిసి ఢిల్లీలో బుధవారం బిజీబిజీగా గడిపారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి సంప్రదింపులు జరిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఠాక్రే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీతోనూ సమావేశం కానున్నారు. కాగా, ఢిల్లీలో ఠాక్రే టీఎంసీ, ఆప్, ఎస్పీ నేతలు సహా పలు విపక్ష నేతలతో మంతనాలు జరపనున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, సీట్ల సర్దుబాటు, ప్రచారాంశాలపై విపక్ష ఇండియా కూటమి నేతలతో ఆయన చర్చిస్తారు. మరోవైపు పలువురు ఇతర పార్టీలకు చెందిన మహారాష్ట్ర ఎంపీలు సైతం ఠాక్రేను ఢిల్లీ పర్యటనలో భాగంగా కలిసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని శివసేన నేత సంజయ్ రౌత్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మెరుగైన ఫలితాలు సాధించిన అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉద్ధవ్ ఠాక్రే తొలిసారి ఢిల్లీ పర్యటనకు వచ్చారు. మరోవైపు, మహారాష్ట్రలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ముంబైలోని మొత్తం 36 సీట్లలో పోటీ చేస్తుందని ఆ పార్టీ ఇటీవల ప్రకటించింది. ముంబైలోని అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటికే సమాయాత్తమయ్యాయని ఆప్ ముంబై చీఫ్ ప్రీతి శర్మ మీనన్ తెలిపారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో జాతీయ పార్టీగా ఎదిగిన ఆప్ ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను విజయవంతంగా నడుపుతున్నదని చెప్పారు. తమకు గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలున్నారని, పార్లమెంట్‌కు గణనీయ సంఖ్యలో ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. పదేండ్లలోనే ఢిల్లీ తరహా అభివృద్ధి మోడల్‌ను ఆప్ దేశానికి పరిచయం చేసిందని చెప్పారు.

## కోల్‌కతాపై బంగ్లాదేశ్ అశాంతి ప్రభావం..





కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాపై బంగ్లాదేశ్ అశాంతి ప్రభావం పడింది. 15 రోజులుగా వ్యాపారాలు బంద్ అయ్యాయి. దీంతో కోల్‌కతాలోని సుమారు 500 మంది వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా కోల్‌కతాకు వచ్చే చాలా మంది బంగ్లాదేశీయులు నగరంలోని మార్క్విస్ స్ట్రీట్, క్రైడ్ స్ట్రీట్, ఎస్ప్లానేడ్, న్యూమార్కెట్ ప్రాంతాల్లో నివసిస్తుంటారు. దీంతో ఈ ప్రాంతాల్లోని వ్యాపారులు బంగ్లాదేశ్ పౌరులపై పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నారు. విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాలు, ట్రావెల్ ఏజెన్సీలు, వీసా సహాయ కేంద్రాలు, బస్సు, రైలు, విమాన టిక్కెట్ బుకింగ్ ఏజెన్సీలు, హోటళ్ళు, రెస్టారెంట్లతోపాటు చిన్న, పెద్ద వ్యాపారాలు ఈ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. పర్యాటకులే కాకుండా వైద్యం కోసం కూడా బంగ్లాదేశ్ నుంచి అనేక మంది ప్రజలు కోల్‌కతాకు వస్తుంటారు. కాగా, ఉద్యోగాల్లో ప్రత్యేక కోటాపై బంగ్లాదేశ్‌లో నిరసనలు ఉధృతమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రధాని షేక్ హసీనా సోమవారం బంగ్లాదేశ్ నుంచి పారిపోయి భారత్‌కు చేరుకున్నారు. దీంతో ఆ దేశంలో ప్రభుత్వం కూలి రాజకీయ అనిశ్చితి నెలకొన్నది. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఆర్మీ పెత్తనం చెలాయిస్తోంది.

మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో కోల్‌కతాకు బంగ్లాదేశ్ సందర్శకుల రాక నిలిచిపోయింది. దీంతో వారిపై ఆధారపడిన పలు వ్యాపారాలు ప్రభావితమయ్యాయి. గత 15 రోజులుగా వ్యాపారం క్షీణించింది. షేక్ హసీనా పరార్ నేపథ్యంలో సోమవారం నుంచి కోల్‌కతా వ్యాపారవేత్తలు భారీ నష్టాలను చవిచూస్తున్నారు.

కాగా, కోల్‌కతాలోని విదేశీ కరెన్సీ మార్పిడి కేంద్రాలు, ట్రావెల్ ఏజెన్సీల పరిస్థితి దారుణంగా ఉంది. అలాగే బంగ్లాదేశీయులపై పూర్తిగా ఆధారపడిన కోల్‌కతాలోని హోటళ్లు, రెస్టారెంట్లతోపాటు ముకుందాపూర్‌లోని అనేక ఆసుపత్రులు కూడా రోగులు లేక బోసిపోయాయి. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు సాధారణ స్థితికి వస్తే తప్ప తమ వ్యాపారాలు కొనసాగవని వ్యాపారులు వాపోతున్నారు.

## రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఈ ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం నాడు ఎన్నిక షెడ్యూల్‌ని విడుదల చేసింది కేంద్ర ఎన్నికల సంఘం. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 స్థానాలకు ఈ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. అస్సాం, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. అలాగే, తెలంగాణ, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తమ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది కేంద్ర ఎన్నికల సంఘం. తెలంగాణలో కే. కేశవరావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో తెలంగాణలో ఒక స్థానం ఖాళీ అయ్యింది.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలివే..**

12 రాజ్యసభ స్థానాల ఎన్నికకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆగష్టు 14వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆగష్టు 21వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అలాగే.. బీహార్, హర్యానా, రాజస్థాన్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీని చివరి తేదీగా ప్రకటించారు. సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజ్యసభ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

**తెలంగాణలో ఇదీ పరిస్థితి..**

ఇంతకాలం బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు.. ఇటీవల ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సమయంలో తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు కేకే. దీంతో ఈ స్థానానికి ఎన్నికలు ప్రకటించింది ఎన్నికల కమిషన్. సెప్టెంబర్ 3వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఆగస్టు 27వ తేదీని చివరి తేదీగా ప్రకటించింది. అయితే, మొత్తం 12 సీట్లలో 11 సీట్లు ఎన్డీయే కూటమి గెలుచుకునే అవకాశం కనిపిస్తోంది. ఒక సీటు మాత్రం కాంగ్రెస్ గెలిచే

# లక్షల సంఖ్యలో రైతులతో సభ..

-మొదటిపేజీ తరువాయి

ఉత్తమ్ పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ,సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్ కుమార్, నాగేందర్ రావు, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్యదినోత్సవం రోజు గోల్కొండ కోటలో సీఎం రేవంత్ జెండా ఎగరేశాక హెలికాప్టర్ ద్వారా నేరుగా ఖమ్మం జిల్లా వైరాకు ముఖ్యమంత్రి చేరుకుంటారని ఉత్తమ్ తెలిపారు. అక్కడే భోజనాలు చేసి వైరాలో జరగనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని అన్నారు. అంతకుముందే సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను రేవంత్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం రైతుల కల త్వరలో నెరవేరబోతోందని ఆయన స్పష్టం చేశారు.

**లక్షల సంఖ్యలో రైతులతో సభ..**

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. సభా స్థలాన్ని ఖమ్మం కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ తదితరులతో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 5న సాగర్ జలాలను విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒకవైపు కృష్ణా జలాలు, మరోవైపు గోదావరి జలాలు వైరా రిజర్వాయర్ సహా ఖమ్మం జిల్లాలో ఆగస్టు 15 నాటికి ప్రవహించనున్నాయని తెలిపారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని చెప్పారు. ఆగస్టు 15న రైతు దినోత్సవంగా జరుపుకోబోతున్నామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత ప్రాంతంలో సీఎం బహిరంగ సభ నిర్వహించేందుకు ఆయన కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



# మన తెలంగాణ బిడ్డ.. మనకు నాన్ లోకల్ అవుతున్నడు..

-మొదటిపేజీ తరువాయి

హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.
మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం గుడ్డెద్దు చెనేలో పడ్డట్టు ఉంది. రాష్ట్ర భవిష్యత్‌ను, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఆలోచన లేకుండా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తుంది. నిన్న మెడికల్ ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ వచ్చింది. మన తెలంగాణ విద్యార్థులకు, భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసే విధంగా ఆ నోటిఫికేషన్‌లో నిబంధనలు ఉన్నాయి. అంటే మన పిల్లలే మనకు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉంది. కనీసం అధ్యయనం లేకుండా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నిబంధనలు విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రిజర్వేషన్లు సాధించాం..**

తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాల మీద జరిగింది. నియామకాలకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం మన ఆకాంక్షలను నిజం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ నియామకాల్లో 60 శాతం లోకల్, 40 శాతం నాన్ లోకల్ రిజర్వేషన్లు ఉండే. 70 శాతం లోకల్, 30 శాతం నాన్‌లోకల్‌గా కూడా నింపేవారు. కానీ కేసీఆర్ శ్రద్ధ పెట్టి ఉద్యోగ నియామకాల విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ చేసి 95 శాతం లోకల్‌కు, 5 శాతం ఓపెన్ కోటాగా నిర్ణయించారు. జీవో నంబర్ 124.. 2018లో విడుదల చేశాం. దీని వల్ల రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రిజర్వేషన్లు సాధించాం. గతంలో 40 శాతం మంది పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఓపెన్ కోటాలో ఉద్యోగాలు పొందేవారు. కానీ కేసీఆర్ రాష్ట్రపతి, ప్రధానిని కలిసి 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కేలా సవరణలు చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 15 శాతం ఓపెన్ కోటా**

విద్యాలయాల్లో ప్రవేశాల విషయంలో కూడా మనం సవరణలు చేసుకోవాల్సి ఉండే. కానీ స్టేట్ రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో పదేండ్ల పాటు పాత పద్ధతి యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అంటే 15 శాతం ఓపెన్ కోటా ఉందో.. ఆంధ్రాలో తెలంగాణ విద్యార్థులు, తెలంగాణలో ఆంధ్రా విద్యార్థులు 15 శాతం ఓపెన్ కోటాలో వెళ్లొచ్చని రాష్ట్ర విభజన చట్టంలో చెప్పారు. కాబట్టి మార్చలేకపోయాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు.




**మేం పెట్టిన కాలేజీల్లో మాత్రం ఓపెన్ కోటా ఇవ్వలేదు..**

డాక్టర్ కావాలని చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు కలలు కంటుంటారు. ఆ విధంగా చదివిస్తారు. అలాంటి పిల్లల భవిష్యత్‌తో ఈ రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. 2014కు ముందు తెలంగాణలో మొత్తం 2850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే.. కేసీఆర్ వచ్చాక ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 9వేలకు పెంచారు. ఈ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. పెంచిన సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కేలా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. తెలంగాణలో 2014లో 20 మెడికల్ కాలేజీల్లో 2850 సీట్లు ఉండే. ఈ సీట్లలో 280 సీట్లు ఓపెన్ కోటాలో ఉండే. కానీ మేం బాగా ఆలోచించి తెలంగాణ వచ్చిన తర్వాత 20గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను 30 మెడికల్ కాలేజీలకు తీసుకెళ్లాం. తెలంగాణ వచ్చిన నాటికి ఉన్న కాలేజీల్లో 15 శాతం ఓపెన్ కోటా పెడుతాం. మేం పెట్టిన కాలేజీల్లో మాత్రం ఓపెన్ కోటా ఇవ్వలేదు.. 100 శాతం మా పిల్లలకు సీట్లు ఇస్తామని చెప్పి జీవో తీసుకువచ్చాం.. దాంతో 520 సీట్లు తెలంగాణ పిల్లలకు అదనంగా దొరికాయి. గుడ్డిగా అదే జీవో ఫాలో అయితే కొత్త కాలేజీల్లో కూడా ఇతర రాష్ట్రాల వారు వచ్చేవారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న విద్యాలయాల్లో 15 శాతం కోటా ఉంటది.. కానీ తర్వాత ఏర్పడ్డ కాలేజీల్లో మా పిల్లలకు దక్కాలని జీవో సవరణ చేశాం అని హరీశ్‌రావు తెలిపారు.

**బీ కేటగిరి సీట్లలో లోకల్ రిజర్వేషన్లు తేవడంతో 1071 సీట్లు దక్కాయి..**

ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లు ఉంటాయి. బీ కేటగిరిలో గతంలో దేశంలోని ఎక్కడి వారైనా చదివే అవకాశం ఉండేది. మేం పర్మిషన్ ఇచ్చిన కాలేజీల్లో ఇతరులు చదవడానికి వీల్లేకుండా బీ కేటగిరి సీట్లలో తెలంగాణ పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలని జీవో సవరించి వెసులుబాటు కల్పించాం. 24 మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లలో లోకల్ రిజర్వేషన్లు తేవడంతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పెట్టిన కాలేజీల్లో 520 ఎంబీబీఎస్ సీట్లు, బీ కేటగిరిలో లోకల్ రిజర్వేషన్లతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ పిల్లలు డాక్టర్లు కావాలి.. మన పిల్లలకు మేలు జరగాలనే తనపనతో ఈ పని చేశాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంబీబీఎస్ అడ్మిషన్లలో అనాలోచితంగా తెలంగాణ పిల్లలకు నష్టం జరిగేలా జీవో తీసుకొచ్చారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 అసమగ్రంగా ఉంది..**

1979లో 646 అనే జీవో తీసుకొచ్చారు. ఈ జీవో ప్రకారం నాటి ఏపీని మూడు భాగాలుగా విభజించారు. తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ. ఈ మూడు ప్రాంతాల్లో 85 శాతం సీట్లు వారి వారి ప్రాంతాల పిల్లలకు దక్కేలా జీవోలో పేర్కొన్నారు. మిగతా 15 శాతం ఓపెన్ కాంపిటీషన్ అని పేర్కొన్నారు. దీని తర్వాత 2014లో రాష్ట్రం విడిపోయింది. రాష్ట్ర విభజన చట్టంలో ఉద్యోగ నియామకాలకు నిబంధన పెట్టలేదు. కేవలం విద్యాలయాల్లో ప్రవేశాలకు మాత్రమే నిబంధన పెట్టారు. విద్యా ప్రవేశాల విషయంలో పాత జీవోను 10 ఏండ్లు పాటించాలని కేంద్రం ఆదేశించింది. అదే జీవోను యథావిధిగా కొనసాగిస్తూ వచ్చాం. 2024 జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావడంతో.. తెలంగాణ రాష్ట్రం స్థానికతను నిర్ధారించుకునేందుకు సొంత రూల్స్ ఫ్రేమ్ చేసుకునేందుకు అవకాశం దక్కింది. మన పిల్లలకు విద్యా ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. స్థానికతను నిర్ధారించేందుకు నియమ నిబంధనలు తయారు చేయాలి. కానీ అలాంటిదేమీ చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ అడ్మిషన్స్ కోసం జీవో నంబర్ 33 ఇచ్చింది. చివరి విద్యాసంవత్సరం నుంచి నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అని చెప్పారు. అంటే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే అది లోకల్ అని పేర్కొన్నారు. ఇది ఆల్రెడీ 1979 జీవోలో ఉంది. 2017 జీవోలో కూడా అదే ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 అసమగ్రంగా ఉంది. ఈ జీవో కారణంగా మన తెలంగాణ బిడ్డలు.. స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# వివాదంలో బీఆర్ఎస్ ఆఫీస్...

**నల్గొండ :** నల్గొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల మధ్య కొత్త వివాదం నడుస్తోంది. నల్గొండ టౌన్ లో అత్యంత విలువైన ప్రాంతంగా పేరుపడ్డ హైదరాబాద్ రోడ్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడమే ఈ వివాదానికి ప్రధాన కారణం. ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కు చెందిన విలువైన భూమిలో ఎకరా స్థలాన్ని బీఆర్ఎస్ 99 ఏళ్లకు లీజుకు తీసుకుంది. అది కూడా గజానికి కేవలం రూ.100 మాత్రమే ఏడాదికి చెల్లించేలా అతి తక్కువ అమౌంట్ కు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, జిల్లా బీఆర్ఎస్ జిల్లా శాఖకు లీజు ఇచ్చింది. వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బీఆర్ఎస్ నిర్మించిన పార్టీ కార్యాలయం నిర్మించిందని ఆ స్థలంపై అక్కడి కార్పొరేషన్ లో వివాదాం జరుగుతున్నట్టే.. నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా భవన్నాన్ని నిర్మించిందని వివాదం జరుగుతోంది.ఆగ్రోస్ నుంచి లీజుకు తీసుకున్న ఎకరా స్థలం కంటే ఎక్కువ స్థలాన్ని బీఆర్ఎస్ వినియోగించుకుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ముఖ్యమైన ప్రాంతంలో, విలువైన భూమిని ప్రభుత్వ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని జిల్లా మంత్రి, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపిస్తున్నారు. మార్కెట్ రేటు ప్రకారం బీఆర్ఎస్ ఆఫీసు నిర్మించిన స్థలం విలువ రూ.2 కోట్ల పైమాటే. స్థానిక మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఆఫీసును కూల్చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు, మున్సిపల్ అధికారులకు బహిరంగంగానే పేర్కొనడం ఇరు పార్టీల మధ్య వేడి పుట్టించింది. " నేను అమెరికా వెళ్లొచ్చేలోగా ఈనెల 11 వ తేదీ నాటికి ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ ఆఫీసును కూల్చాలి.." అంటూ మంత్రి కోమటిరెడ్డి తాజా హుకుం జారీ చేయడంతో బీఆర్ఎస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ కు మున్సిపల్ అధికారులు ఫైనల్ నోటీసులు కూడా ఇచ్చేశారు.జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఏక పక్షంగా విలువైన భూమిని లీజు కింద తీసేసుకుందన్న ఆరోపణలు మొదటి నుంచీ ఉన్నాయి. వాస్తవానికి నల్గొండ టౌన్ లో టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎంలకు సొంత ఆఫీసు భవనాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ప్రకాశం బజారులో పాత బస్టాండు సమీపంలో భూమి ఉన్నా పార్టీ కార్యాలయ నిర్మాణం అరకొర పనుల తర్వాత నిలిచిపోయింది. అయితే, బీఆర్ఎస్ మొదటి నుంచీ తన పార్టీ కార్యాలయాన్ని అద్దె భవనంలోనే కొనసాగించింది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం హయాంలో పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు జరగలేదు. 2018లో రెండో సారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపు, భూమి పూజలు, భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2023లో మూడో సారి తెలంగాణ రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ చేతి నుంచి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకుంది.దాదాపు అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులపై వివరాలు సేకరిస్తున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఆగ్రోస్ సంస్థకు ఉన్న విలువైన భూమిలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. మిగిలిన భూమిలో బీఆర్ఎస్ కు ఎకరం స్థలాన్ని 99 ఏళ్లకు అతి తక్కువ లీజ్ అమౌంట్ కు ఇవ్వడంపై మొదట్లోనే విమర్శలు, వ్యతిరేకత వచ్చింది. అయితే, అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండడం, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేతో పాటు, నల్గొండ మున్సిపాలిటీ కూడా బీఆర్ఎస్ చేతిలోనే ఉండడంతో భూ కేటాయింపులు తేలిగ్గా జరిగిపోయాయి. 2023 ఎన్నికల తర్వాత నల్లగొండ ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజయం సాధించడం, ఇప్పుడు రాష్ట్ర కేబినెట్ లో ఆర్ అండ్ బి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తుండడం, నల్గొండ మున్సిపల్ చైర్మన్ పై అవిశ్వాసం నెగ్గి, కాంగ్రెస్ చేతిలోకి మున్సిపాలిటీ వెళ్లిపోవడం వంటి పరిణామాలు జరిగాయి. దీంతో విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు నల్గొండ మున్సిపాలిటీ సిద్ధమైంది. దీనికి మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు తోడుకావడంతో ఇది రాజకీయ రంగును పులుముకుంది.

## రైతన్నకు గడువు!

-మొదటిపేజీ తరువాయి

ఉన్న మొత్తాన్ని చెల్లించడానికి 4 నుంచి 6 నెలల గడువిచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రుణమాఫీ జీవో 567 ప్రకారం.. రూ.2 లక్షలపైన ఎంత ఎక్కువ ఉంటే అంత మొత్తాన్ని రైతులు ముందుగా చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తుంది. దాంతో రైతులు రుణవిముక్తులవుతారు. ఆ తర్వాత మళ్లీ కొత్తగా పంట రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రూ.2 లక్షలపైన స్వల్పమొత్తంలో అప్పున్న రైతులు కొందరు..ఆ మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. రైతులు ఎప్పుడు చెల్లించినా తీసుకోవాలని ప్రభుత్వం బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసింది. గంపగుత్తగా కాకుండా రైతులు ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు పైమొత్తాన్ని కట్టించుకొని రూ.2 లక్షలు నగదు బదిలీ చేసి రుణ విముక్తులను చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే రైతులు తమ వీలునుబట్టి డబ్బు సర్దుబాటు చేసుకొని.. రూ.2 లక్షలకు మించి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటే, ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని మాఫీ చేస్తూ పోతుంది. అయితే ఈ ప్రక్రియను నిర్ణీత కాలపరిమితిలోపు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పలు సంక్షేమ పథకాలను అమలు చేయడానికి డిసెంబరు 9కి ప్రాధాన్యమిస్తున్న రేవంత్ సర్కారు.. రుణమాఫీ ప్రక్రియను కూడా అప్పటికే ముగిస్తుందా? లేక 6 నెలల సమయమిచ్చి 2025 ఫిబ్రవరి వరకు గడువు విధిస్తుందా? లేక 2025 మార్చి 31 వరకు డెడ్‌లైన్ పెట్టి రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేస్తుందా? అనే చర్చ కూడా వ్యవసాయశాఖలో జరుగుతోంది.

**మూడో విడత రుణమాఫీకి రూ.6 వేల కోట్లు!**

మూడో విడత రుణమాఫీకి మరో రూ.6 వేల కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. లక్షన్నర నుంచి రూ.2 లక్షల బకాయిలున్న 6 లక్షల మంది రైతులకు మూడో విడతలో ఈ నెల 15న రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ నిధులు సర్దుబాటు చేస్తోంది. గత నెల 23న రూ.3 వేల కోట్లు, 30న రూ.1,000 కోట్ల అప్పును భారతీయ రిజర్వ్ బ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. తాజాగా ఈ నెల 6న మరో రూ.3 వేల కోట్లను ఆర్‌బీఐ నుంచి వేలంపాట ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి రాగానే 15న ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించే బహిరంగసభలో మూడో విడత రుణమాఫీని పంపిణీ చేయనున్నారు. కాగా, రెండు విడతల్లో 17.91 లక్షల మంది రైతులకు రూ.12,289 కోట్ల నిధులు సర్దుబాటు చేశారు. మూడో విడతలో 6 లక్షల మంది రైతులకు రూ.6 వేల కోట్ల నిధులు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. మిగిలిన రైతులు రూ.2 లక్షలకు మించి అప్పున్న విభాగంలో ఉంటారు.

## ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం.. కారణమిదే!



**భద్రాద్రి కొత్తగూడెం :** ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయం అన్నదాన సత్రం వద్ద వరద నీరు నిలవడంపై మండిపడ్డారు. మంత్రి ఆదేశాలను గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఉదయం నుంచి నీటిలో మునిగి వున్న రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగనట్టైంది. కాగా.. గోదావరి నీటిమట్టం 33 అడుగులు ఉండటంతో లాక్‌లను అధికారులు ఎత్తివేశారు. మళ్లీ గోదావరి ప్రవాహం 36 అడుగులకు చేరితేనే లాకులను మూసివేయనున్నారు. కాగా.. భద్రాచలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రామాలయం పరిసర ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది. పట్టణంలోని వర్షపు నీరు డ్రైయినేజ్ నీరు మోటార్లతో ఎత్తిపోయక పోవడంతో వరద నీరు నిలిచిపోయింది. దేవస్థానం ఆలయం అన్నదాన సత్రంలోకి చేరిన వరద నీరు చేరింది. దీంతో అన్నదానం సత్రాన్ని మూసివేశారు. భక్తులకు పాకెట్‌ల ద్వారా అన్నదానానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరి నది కరకట్ట స్లూయిజ్‌ల నుండి వర్షపు నీటిని పంప్ చెయ్యకపోవడంతో నీట మునిగిన రామాలయ ప్రాంతం నీట మునిగింది. విషయం తెలిసిన మంత్రి తుమ్మల.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి విడుదల చేయడంతో రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగింది.

**కూలడానికి సిద్ధంగా ఈశాన్య మండపం...**

మరోవైపు.. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ కుసుమ హరినాథ్ బాబా మందిరంలో ఈశాన్య మండపానికి బీటలు వారాయి. భారీ వర్షాల కారణంగా ఈశాన్యం మండపం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండప అడుగుభాగం పూర్తిగా దెబ్బతిన్నది. కింద భాగం పెచ్చులు ఊడి కింద పడటంతో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అక్కడకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మండపాన్ని పూర్తిగా తీసివేసి పరిస్థితి చక్కదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పాటిల్ ఆదేశాలు జారీ చేసింది.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు..

-మొదటిపేజీ తరువాయి

మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాము. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటిలానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తం, తెలంగాణ కోసమే పోరాడుతాం%ొ% కానీ తలవంచం.. ఎన్నటికైనా ఎప్పటికైనా అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## నీటిపారుదల రంగంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసింది. అంతేకాదు.. తెలంగాణలోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ కోసం మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశారు.

**కమిటీలో సభ్యులు వీరే..**

తెలంగాణ నీటిపారుదల రంగా అభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కేబినెట్ సబ్ కమిటీలో.. మంత్రులు సహా అధికారులు సభ్యులుగా ఉన్నారు. పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఐ అండ్ సీఏడీ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. నీటిపారుల రంగంపై ఈ కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం చేసి సిఫారసు చేయనుంది.

**ఆగష్టు 9న తొలి భేటీ..**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటిపారుదల శాఖ మంత్రివర్గ ఉప సంఘం ఆగష్టు 9వ తేదీన సమావేశం కానుంది. రాష్ట్రంలోని జలాశయాలు.. వాటి పరిస్థితి, పునరుద్ధరణ అంశాలపై పరిశీలన చేసి సిఫారసులు చేయనుంది. కేంద్ర జల వనరుల శాఖ సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వం ఈ మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు తొలి సమావేశం నిర్వహించనున్నారు.

# సస్పెండ్ చేయడం కాదు పోలీసులను ఉద్యోగం నుంచి తొలగించాలి

- పోలె విష్ణు-బహుజన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు.

పోలీసులపై ఎస్సీ,ఎస్టీ చట్టం కింద కేసులను నమోదు చేసి,శిక్షించాలి-న్యాయవాది రాధిక..

ప్రభుత్వం బాధితురాలికి నష్ట పరిహారం చెల్లించాలి-న్యాయవాది దొడ్డి శ్రీనివాస్



**(షాద్ నగర్/శుభ తెలంగాణ)** బహుజన సైన్యం,బహుజన అడ్వకేట్స్ సమాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బహుజన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు,హైకోర్ట్ న్యాయవాది పోలె విష్ణు మాట్లాడుతూ షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు దొంగతనం పేరుతో మాల కులానికి చెందిన పెరుక సునీతపై,భర్త భీమయ్యలపై దొంగతనం నెపం మోపి,పోలీసు స్టేషన్ లో బందించి చిత్ర హింసలకు గురిచేశారని,నేరాన్ని ఒప్పుకోమ్మని బలవంతం చేశారని,మహిళను డిటేక్టివ్ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి మరియు పోలీసు సిబ్బంది తీవ్రంగా కొట్టారని,మహిళ కాళ్లు మోచేతులు మలచి కట్టేసి కొట్టారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు,పోలీసులకు కొట్టె హక్కు లేదని,జై భీమ్ సినిమాను తలపించిదని,ప్రభుత్వం పోలీసులపై సస్పెన్షన్ వేటు వేసిందని,సస్పెన్షన్ వెటుకాదు-ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది రాధిక మాట్లాడుతూ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని,అర్ధరాత్రి వరకు చిత్ర హింసలకు గురిచేయడం చట్ట విరుద్దమని,షాద్ నగర్ పోలీసులపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వారిని ఉద్యోగం నుండి తొలగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు అటవీక చర్యలకు పాల్పడినారని,ఈ విషయంపై మహిళ కమిషన్,ఎస్సి,ఎస్టీ కమిషన్ స్పందించి బాధితులకు రక్షణ కలిపించాలని,వారికి నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బహుజన సైన్యం రాష్ట్ర ఉపాధక్ష్యులు దర్శనం శ్రీనివాస్,న్యాయవాది మంగళం రాకేష్ పాల్గొన్నారు.

## వికలాంగులకు బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం...






**-ఎన్ పి ఆర్ డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్,ప్రధాన కార్యదర్శి యం అడివయ్య**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వికారాబాద్ జిల్లా 2వ మహాసభ జిల్లా అధ్యక్షులు జె దశరథ్ అధ్యక్షతన క్లబ్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఎన్ పి ఆర్ డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్,రాష్ట్ర కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూలి

2011జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని, ఘనంకలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక ఘనంకాల విభాగం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం 19 శాతం మంది చూపు, వినికిడి లోపం కలిగి ఉన్నారని, 8శాతం మంది బహుళ వైకాల్యం కలిగి ఉన్నారని అన్నారు.76శాతం మంది గ్రామీణ ప్రాంతంలో,24శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మరియు ప్రభుత్వయేతార సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే పెన్షన్స్ కేవలం 5.75లక్షల మందికే వస్తున్నాయని అన్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సభర్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు.నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.వికలాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టెందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవలని అన్నారు. తీవ్ర వైకాల్యం కలిగిన వికలాంగులకు ప్రత్యేక అలావెన్స్ ఇవ్వాలని నిర్ణయం చేసిన ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.పెండింగ్ లో ఉన్న వివాహ ప్రోత్సాహకం నిధులు వెంటనే విడుదల చేయాలని అన్నారు.సామూహిక ప్రాంతాలన్నీ అవరోధ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసి 4 ఏండ్లు అవుతున్న ఎలాంటి పురోగతిలేదన్నారు. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కో ఆర్డినేషన్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. మానసిక, అంటీజం, హేమోఫిలియా, సికిల్ సెల్ కండరాల క్షినత వంటి వైఖల్యాలు కలిగిన వికలాంగుల సంక్షేమ%శీ% కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ధ్రుష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు 5 లక్షల మంది ఉన్నారని వీరికి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో చదువుకునే హక్కు లేకుండా పోతుందని అన్నారు. 2009 విద్య హక్కు చట్టం, ఆర్పిడబ్ల్యుడి చట్టం మానసిక వైకాల్యం కలిగిన వారికి పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూగ, చెవిటి వైకాల్యం కలిగిన విద్యార్థులు 2 లక్షల మంది ఉంటే వీరికి సైన్ లాంగ్వేజ్ అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్తులను గుర్తించి వారికి విద్య అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.ఆసరా పెన్షన్స్ ప్రతి నెల పంపిణి చేయకపోవడం వలన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.పెన్షన్ పెంచకుంటే రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ మహిపాల్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ప్రజాపాలన దరఖాస్థులు ఎప్పటి లోపు పరిష్కారం చేస్తారని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. పేదల సంపద దోచి పెట్టుబడి దారులకు కట్టాబేడుతున్నారని అన్నారు. ధరల పెరుగుదలను ఎందుకు అరికట్టడం లేదన్నారు.సమస్యల పరిష్కారం కోసం ఉద్యమలకు సిద్ధం కావాలని అన్నారు.

మహాసభల్లో జిల్లా అధ్యక్షులు జె దశరథ్, కార్యదర్శి ఆర్ శంకర్, కోశాధికారి సావిత్రి, జిల్లా నాయకులు మారుతీ, సత్యమ్మ, సలీమ్, నారాయణ గౌడ్, ఆనంద్, అనంతలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, గణేష్, నందయ్యా, రాజు, విశ్వమ్మా, శ్రీదేవి, ఈశ్వరమ్మా, దినేష్, యాదగిరి, జారిన, పాపయ్య, పెంటయ్య, లతో పాటు వివిధ మండలాల వికలాంగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ అడ్మిషన్లలో స్థానిక చిచ్చు

**హైదరాబాద్ , శుభ తెలంగాణ :** తెలంగాణలోని వైద్య ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో జాతీయ కోటా మినహా మిగిలిన కన్వీనర్ కోటా సీట్లన్నీ స్థానిక విద్యార్థులకే దక్కనున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 10 సంవత్సరాలపాటు అమలైన 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లు ఈ ఏడాది నుంచి రద్దయ్యాయి. రాష్ట్రంలో 2014కు ముందు ఏర్పాటైన అన్ని మెడికల్ కాలేజీల్లో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీపడేవారు. అయితే 2024 జూన్ 2 నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయింది. దీంతో కన్వీనర్ కోటా సీట్లన్నీ స్థానిక విద్యార్థులతోనే భర్తీ చేయనున్నారు. అయితే ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నిబంధనలతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగనుంది. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో.. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 3న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రవేశ ప్రక్రియకు సంబంధించిన వర్సిటీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో.. స్థానికత నిర్ధారణపై గతంలో ఉన్న నిబంధనల్లో మార్పులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 19న జారీ చేసిన 33జీవో ప్రకారం స్థానికత నిబంధనలను పేర్కొన్నట్టు వర్సిటీ తెలిపింది. ఈ నిబంధనలతో తీవ్ర అన్యాయం జరిగేలా ఉందని స్థానిక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే 2023-24 విద్యా సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 7 సంవత్సరాల కాలంలో గరిష్ఠంగా నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణలోకి తీసుకునేవారు. స్థానికతపై ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి చేసిన మార్పులతో తెలంగాణ వారికే ఎక్కువ అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా 10 సంవత్సరాల గడువు.. ఈ ఏడాది జూన్ 2తో ముగిసింది. విద్యాసంస్థల్లో ఏపీ విద్యార్థులకు కోటాలోనూ ఇదే అమలు కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్మాత్మక కళాశాలలు లేనందున.. అక్కడి విద్యార్థులకు వైద్యవిద్యలో అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ను తీసుకువచ్చినట్లు స్పష్టమవుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన జీవోతో హైదరాబాద్‌లో చదివిన ఏపీ విద్యార్థులు తెలంగాణలో స్థానికులుగా ఉంటారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని చాలా ప్రాంతాలకు చెందిన వారు విజయవాడ, గుంటూరులలో ఇంటర్మీడియట్ చదువుతారు. అదే సమయంలో ఇంటర్మీడియట్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారుతున్నారు. వారికి స్థానికత కోటాకు దూరమవుతున్నారు. తెలంగాణలో పుట్టి పెరిగి కేవలం రెండేళ్ల ఇంటర్మీడియట్ చదువుల కోసం ఏపీకి వెళ్లిన వారు సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలకు మేలు చేసేందుకే స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో.. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 3న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగస్టు 4న ప్రారంభమైంది.

### న్యాయవాదులపై పోలీసుల దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జ్ లు ధరించి విధులకు హాజరు.



**(కామారెడ్డి/శుభ తెలంగాణ)** జనగామలో న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం కామారెడ్డి న్యాయవాదులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులకు హాజరయ్యారు.అలాగే జిల్లా కోర్టు ప్రాంగణం ముందు ధర్నా చేసి జనగామ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడి చేయడం పోలీసులకు పరిపాటి అయిందని,ఈ విషయమై సదరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే న్యాయవాదుల రక్షణ కోసం వెంటనే న్యాయవాదులు రక్షణ చట్టం అమలు చేయవలసిందిగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జగన్నాథం, శంకర్ రెడ్డి,అన్వర్ షరీఫ్,సిద్ధి రాములు, శ్యామ్ గోపాల్,బిక్షపతి,అమృత రావు, అతిమాముల శ్రీధర్,గోవర్ధన్ మరియు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం.

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి**



**(మేడ్చల్ జిల్లా/శుభ తెలంగాణ)** డ్రెయినేజీ సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి అన్నారు.జవహర్ నగర్ కార్పొరేషన్,బాలాజీ నగర్,ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ వంపుగూడలో డ్రెయినేజీ సమస్యలను బుధవారం మేడ్చెల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ లతో కలిసి పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల సమస్యలను మరుగున పడేశారని,అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలను గుర్తించి మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా ప్రజాపాలనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గం లో అనేక సమస్యలు ఉన్నాయని,వాటి పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అదిక నిధులు తెచ్చి ప్రజల కష్టాలను ప్రాలదోలుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి,మేడ్చెల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్,కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి,జవహర్ నగర్ మేయర్ శాంతి కోటేష్ గౌడ్,డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి,సీతారాం రెడ్డి,అంజి రెడ్డి,రాఘవ రెడ్డి,పెద్ది సీను,కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగశేషు,ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షులు ప్రసాద్ గారు,మల్ల రెడ్డి, సత్యనారాయణ, నాగరాజ్, పాకాల రాజు,అల్లూరయ్య,పూర్ణ యాదవ్,రాకేష్ యాదవ్, గురాళ్ళ సంతోష్ రెడ్డి,లింగం, పవన్,విట్టల్,శివ,రమాకాంత్ రెడ్డి,సుంకు శ్రీకాంత్ రెడ్డి,భూపాల్ రెడ్డి,నర్సింహ,అనిల్,ప్రశాంత్,శ్రీధర్ రెడ్డి, సతీష్,బాబుజగదీష్, బిఎంగౌడ్,గణేష్,అరుణ్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్ధిక సాయం...

**మర్పల్లి, శుభ తెలంగాణ:** మండల పరిధిలోని దామస్తాపూర్ తండాలో కేతావాట్ జాంకాబాయి అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి గారు జాంకాబాయి అంత్యక్రియలకు 5 వేల రూపాయలు పంపించగా మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేశ్ నాయక్ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఎస్ కే ఆర్ పంపిన నగదును అందజేశారు.. దర్మీయా, సునీల్, ఆరేశ్, సంగమేశ్ తండా వసూలు పాల్గొన్నారు..

### మున్సిపల్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి...

**-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** మున్సిపల్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు, 23వ వార్డులలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. మున్సిపల్ లోని వివిధ వార్డుల్లోని మున్సిపల్ పార్కుల అభివృద్ధితోపాటు వాకింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. పార్కుల్లో యోగ బెడ్స్ ను, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా వివిధ పరికరాలను సమకూర్చాలని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛధనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసి వార్డులవారీగా పారిశుద్ధ కార్యక్రమాలను చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీన పార్కుల్లో పెద్ద మొత్తంలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. 24వ వార్డులోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ సామ్, మామ్ పిల్లల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు బాలామృతం తో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ టీచర్లు పిల్లల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా మేకలగండి లోని డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ తో పాటు ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభావతి, రామస్వామి లు పాల్గొన్నారు.

# మహిళల భద్రతయే.. మా మొదటి ప్రాధాన్యత

**విద్యార్థినిలు భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఫిర్యాదు చేయండి..!**

**ఎస్పీ అఖిల్ మహజన్**



**రాజన్న సిరిసిల్ల, శుభ తెలంగాణ :** సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విద్యార్థి దశనుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు మహిళలు వేధింపులకు గురైనట్లు అయితే షీ టీమ్ నెంబర్ 8712656425 లేదా డయల్ 100 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు, మహిళల,విద్యార్థినిల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్న నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, మహిళ భద్రతయే పోలీస్ శాఖ మొదటి ప్రాధాన్యత అని,విద్యార్థిని విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులని చైతన్య పరచాలనే ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులకు మహిళ రక్షణ, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్ పోక్సో, సైబర్ క్రైమ్స్, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. మహిళలు మరియు చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని, మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుండి మహిళల రక్షణ కొరకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా షిటీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీలు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదన్నారు. మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని,మైనర్ బాలికల పై ఎవరైనా అఘాయిత్యాలు చేస్తే ఫోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్ వారిని సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425 డయల్ 100 కు సమాచారం ఇవ్వగలరని, సమాచారం అందించిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచడతాయని ఎస్పీ తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల సోషల్ మీడియా ఫేసుబుక్, ఇన్స్టాగ్రామ్ కు దూరంగా ఉండాలని, ప్రస్తుతం మహిళలపై వేధింపులు అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేధింపులు ఆన్లైన్ వేధింపులు సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగుతున్నాయని ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని, విద్యార్థి దశనుండే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణ పట్టుదల ఓపికతో కష్టపడినప్పుడు మంచి విజయాలు సాధిస్తారన్నారు. చదువుకునే యుక్త వయస్సు లో యువతులు ప్రలోభాలు, ఆకర్షణలకు గురై భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని జీవితంలో ప్రతి స్టేజ్ ముఖ్యమే అని ఈరోజు మీరందరూ ఇక్కడ సంతోషంగా ఉన్నారు అంటే మీ తల్లిదండ్రులు ఏదో రకంగా కష్టపడి పని చేసి మిమ్మల్ని ఇక్కడికి పంపించడం జరిగిందని ఎప్పుడు మర్చిపోకూడదని తల్లిదండ్రులను అర్థం చేసుకొని గౌరవిస్తూ వారి కళలను నెరవేస్తూ ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డిఎస్పీ చంద్రశేఖర్, సిఐ కృష్ణ,షీ టీం ఏ. ఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేతన్నలే చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్లు



కరీంనగర్, **శుభ తెలంగాణ** : నేత కార్మికుల కష్టంతో వెలువడే ఉత్పులను ప్రచారం చేయడానికి మనకన్నా పెద్ద బ్రాండ్ అంబాసిడర్లు ఉండరు కాబట్టి చేనేత వస్త్రాల ప్రచారానికి చేనేత కార్మికులే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, చేనేత కార్మికుల కష్టంతో వెలువడే ప్రతి ఉత్పాదనకు వారే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని, ఆ దిశగా వారిద్వారా ఉత్పత్తి కాబడే వస్త్రాలను వారే దరిస్తూ వాటి ద్వారా సమకూరే సౌకర్యాలను గురించి వారే ప్రచారం చేయాలని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో చేనేత స్టాల్ ను ఏర్పాటుకు నేత కార్మికులు సుముకంగా ఉన్నట్లయితే స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. నేత కార్మికుల ద్వారా ఉత్పత్తి కాగా మిగిలిన వాటితో చిన్న చిన్న బ్యాడ్జీల వంటి వాటిని కూడా ఉత్పత్తి చేసి వాటిని రాష్ట్ర మరియు జాతీయ ఫార్మేషన్ డే కార్యక్రమంలో వినియోగించేలా నేత కార్మికులు కృషి చేయాలని తెలిపారు. నేత కార్మికులు ఉత్పత్తి చేసే వాటికి ప్రభుత్వం పర్చేస్ ఆర్డర్ ఇస్తుందనే దిశగా ఎదురుచూడకుండా ప్రస్తుత మార్కెట్ కు అనుగునంగా ఉత్పత్తులు చేస్తూ అభివృద్ధి దిశగా పయనించాలని సూచించారు. సంక్షేమ పథకం క్రింద ఉండే వసతి గృహాలకు అవసరమయ్యే దరి, బెడ్ షీట్ లు, కర్టన్ లు, డోర్ మ్యాట్ మొదలగు వాటిని కొనుగోలు చేయడానికి పర్చేసింగ్ కమిటీ సభ్యులుగా స్థానికంగా మనమే ఉంటాం కాబట్టి సాధ్యమైనంత వరకు సొసైటీల ద్వారా చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని, చేనేత ఉత్పాదనలకు మరింత డిమాండ్ పెరిగే కొత్త రంగులు వాడి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఓలంపిక్ వరకు మన చేనేత రంగం ద్వారా ఉత్పత్తి చేయబడే వస్తువులు వెలుతున్నాయని తెలిపారు. డిసిసి చైర్మన్ కోడూరు రవీందర్ మాట్లాడుతూ, అంతరించి పోతున్న కళగా చేనేత వృత్తి మారుతుందని, వ్యవసాయం తర్వాత అంత ప్రాచుర్యం పొందిన చేనేతరంగంపై యువకులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మగ్గాలు నడవడవకుండా పోవడానికి ముందే తగిన చర్యలపై పునరాలోచించాలని అన్నారు. సుమారు వంద కోట్ల టర్నోవర్ ఉందని, మరింత దృష్టి సారించి నట్లయితే ఇంకా అభివృద్ధి చెందవచ్చనని తెలిపారు. పద్మశాలిలతో పాటు ఇతర కులాల వారు మొగ్గుచూపుతున్న చేనేత వృత్తికి పునరుజ్జీవం పొసే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా అవసరమైన సహాయ సహాకారాలను అందిస్తానని, పంట ఋణాన్ని ఏ విధంగా రైతులకు అందించడం జరుగుతుందో అదే విధంగా చేనేత కార్మికులకు అందేలా సహకారం అందిస్తానని తెలిపారు. యువత చేనేత రంగంపై దృష్టి సారించాలని, వ్యాపార కార్యక్రమాలను నిర్వహించుకొనుటకు, నిర్వహణ మూలధనం కింద క్యాష్-క్రెడిట్ ల సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అన్నారు. నగర మేయర్ వై. సునీల్ రావు మాట్లాడుతూ, భారతదేశంలో చేనేత కు ప్రత్యేక స్థానం ఉందని, చేనేత కార్మికుల అభివృద్ధి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యల దిశగా కృషి చేయాలని, తెలంగాణ ఆవిర్భావం తర్వాత చేనేత రంగాన్ని మరింత ప్రోత్సహించే కార్యక్రమాలు వచ్చాయని, అదే విధంగా పోటీ ప్రపంచంతో పోటీ పడేలా నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చివరగా వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, చేనేత కార్మికులను సత్కరించారు. అనంతరం పావలా వడ్డీ పథకం 2021-22 సంవత్సరానికి గాను 20 సంఘాల కు రూపాయలు 16 లక్షల 19 వేల 011 ల చెక్కును అందజేసి చేనేత స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏడి హ్యాండ్ లూమ్ చరణ్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సువార్తా, సంక్షేమ అధికారి సరస్వతి, బిసి వెల్ఫేర్ అధికారి అనీల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# యాదాద్రిలో ఉద్యోగుల బదిలీ...

**నల్గొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉద్యోగుల ప్రక్షాళన ప్రారంభమైంది. ఆలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన 26 మంది ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. యాదాద్రి నుంచి రాష్ట్రంలోని ఇతర ఆలయాలకు ఉద్యోగులను బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో సాధారణ బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జేసీ(6ఎ), డీసీ (6బి), ఏసీ (6సి) హోదా కలిగిన దేవాలయాలకు చెందిన ఉద్యోగులలో ఒకే చోట నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిలో 40 శాతం వరకే స్థానచలనం కలిగించాలన్నదే దేవాదాయశాఖ యోచన. ఇందులో భాగంగానే ప్రముఖ ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా ఒకేచోట పనిచేయడంతో అవినీతి, అక్రమాల ఆరోపణలను కొందరు ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆలయాల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తే అవినీతి, అక్రమాలను రూపుమాపవచ్చని సర్కారు బదిలీల ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్జేసీ హోదా గల యాదాద్రి, భద్రాచలం, వేములవాడ ఆలయాల ఉద్యోగులు బదిలీ అయ్యారు. యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి 65 మంది ఉద్యోగులు కౌన్సిలింగ్ కు హాజరు కాగా, 26 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో ఉన్న సమయంలో కొమురవెల్లి ఆలయం నుంచి యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం, బాసర తదితర ఆలయాలకు ఉద్యోగులు బదిలీపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహించిన ఉద్యోగులు ఇక్కడికి వచ్చారు. అప్పట్లో జరిగిన బదిలీలు తప్ప మరోసారి ట్రాన్స్‌పర్లు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు జరిగిన బదిలీల్లో ఇద్దరు ఏఈవోలు, ఆరుగురు సూపరింటెండెంట్లు, ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఒక సివిల్ ఇంజినీర్ డీఈ, ఒక ఎలక్ట్రికల్ ఏఈ ఉన్నారు. యాదాద్రి ఆలయంలో చివరిసారిగా 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బదిలీలు జరిగాయి. అప్పటి నుంచి యాదాద్రి ఆలయంలో ఇప్పటివరకు బదిలీలు జరగలేదు. చాలా మంది అధికారులకు, పలు విభాగాలలో పనిచేసే ఉద్యోగులకు పదోన్నతులు లభించి యాదగిరిగుట్టలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపుగా 15 ఏళ్ల తర్వాత, తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారిగా బదిలీలు జరిగాయి.

## లేగ దూడను చంపిన చిరుత

**నిజామాబాద్, శుభ తెలంగాణ :** నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి మండలం యానంపల్లి గ్రామంలో లేగదూడపైచిరుతపులి దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందల్వాయి,అటవీశాఖఅధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్పల్లి, మండలం యానంపల్లి గ్రామ శివారులో తోటమనోజ్ కుమార్ కు చెందిన కొట్టంలో లేగ దూడపై మంగళవారం తెల్లవారుజామున చిరుతదాడిచేసింది. ఉదయం చూసేసరికి లేగదూడ మరణించి ఉండడంతో యజమాని వెంటనే అటవీఅధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు, వినయ్, శ్రీకాంత్, ఘటనా స్థలానికి చేరుకునిపరిశీలించారు. ఈ విషయమై అటవీశాఖ రేంజ్ఆఫీసర్ రవిమోహన్ భట్ మాట్లాడుతూ చిరుతదాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించామనితెలిపారు. కాగా.. చిరుత సంచరిస్తున్న వార్తతోస్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాకతీయ, లక్ష్మీకాలువల ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్, శుభ తెలంగాణ :** నిజామాబాద్ జిల్లా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులకు కాకతీయ, లక్ష్మి కాలువల ద్వారా ఖరీఫ్ వంటలకు సాగునీటిని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ఇదే నీళ్ల కోసం మనం ఎన్నో పోరాటాలు చేశాం. గోదావరి ప్రాణహిత కలిసి నటువంటి గోదావరి నదిలో బ్రహ్మాండమైన నీళ్లు వస్తున్నాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏదో రాజకీయాల కారణంగా కేసీఆర్ కాళేశ్వరం కట్టినాడు కెసిఆర్ కు మంచి పేరు వస్తుందని దురుద్దేశంతో దౌర్భాగ్య ఆలోచన చేసుకొని కాళేశ్వరం ప్రాజెక్టుకు 90 వేల కోట్లు ఖర్చుపెట్టినటువంటి కాళేశ్వరం ప్రాజెక్టులో 4వెల కోట్లు ఖర్చు అయిన మేడిగడ్డ బ్యారేజీలు 84 వేల పిల్లలు ఉంటే రెండు పిల్లర్లు కుంగినాయి అనే షాకుతో కాళేశ్వరం కొట్టుకుపోయిందని ఏవో అబద్ధపు ప్రచారాలు చేస్తూ సముద్రంలోకి ప్రాణహిత కలిసిన తర్వాత గోదావరి నుండి సముద్రంలోకి పోయే నీటిని ఎత్తిపోసే అవకాశమున్న పంపు హౌస్ లు రెడీ ఉన్న ఎత్తిపోయకుండా కాలయాపన చేస్తూ రైతులకు నీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను ఏడిపిస్తున్నాదని ప్రభుత్వంపై ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసజాలు మానాలి ఆయకట్టు రైతులను కాపాడాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల నిరసన

**నిర్మల్ , శుభ తెలంగాణ:** నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో మహిళలకు ఫ్రీ బస్ టికెట్ తొలగించి ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు మండల ఆటో యూనియన్ మండల అధ్యక్షులు నగేష్, ఉపాధ్యక్షులు ఫసి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఫ్రీ బస్ టికెట్ ప్రభుత్వం కల్పించడంతో ఆటోలకు గిరాకీలు లేక ఆటో కార్మికుల కుటుంబాలు ఆర్తికి ఇబ్బందులతో తలడిల్లుతున్నాయన్నారు. వెంటనే ఫ్రీ బస్ టికెట్ తొలగించలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల ఆటో యూనియన్ నాయకులు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## నగరంలో సెప్టెంబర్ 7 నుంచి గణేష్ ఉత్సవాలు

**హైదరాబాద్ , శుభ తెలంగాణ:** సామూహిక గణేశ ఉత్సవాలకు భాగ్యనగరం ముస్తాబవుతుందని అందులో భాగంగా ఈరోజు హైదరాబాద్ అఫ్జల్ గంజ్ లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెక్రటరీ శశిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 7వ తేదీన ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు సెప్టెంబర్ 17వ తేదీన గణేష్ నిమజ్జనంతో ముగుస్తాయని... అందుకుగాను పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. భాగ్యనగర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది ఏంటంటే ఈ ఉత్సవాలు ఏ విధంగా జరుగుతున్నాయని తెలుసుకోవడానికి, ఈ ఉత్సవాలను స్ఫూర్తిగా తీసుకొని దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం సామూహికమైనటువంటి ఉత్సవాలను నిర్వహించుకుంటా ఉంది కాబట్టి ఈ సంవత్సరం మరింత ఉత్సాహంతోటి ప్రదేశం సదర్వం సంస్కృతి పరిరక్షించుకోవాలనేటువంటి ఒక లక్ష్యంతోటి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం లోపట ప్రతి గణేష్ మండపముని యొక్క భాగస్వామ్యాన్ని తీసుకొని ముందుకు పోతుంది అదేవిధంగా ప్రభుత్వం కూడా అన్ని విభాగాలు సమన్వయపర్చడానికి ఈపాటికి పనులు సమావేశాలు ప్రారంభమైన అన్ని ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యొక్క అన్ని ప్రభుత్వ విభాగాలను కూడా సమన్వయపరచుకుంటూ మా సూచనలు సలహాలు ప్రభుత్వం ముందు పెడుతూ గతంలో ఉన్నటువంటి అనుభవాలను ప్రభుత్వం ఈ సంవత్సరం అధిక బడ్జెట్ను కూడా కేటాయించి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం లోపట ప్రభుత్వాన్ని కూడా పూర్తి సహకారం ఉంటుందని మేము ఆశిస్తున్నాం ప్రభుత్వం కూడా ఆ రకమైన సిద్ధం కావాలని కోరుకుంటున్నామని అన్నారు.

## లోకల్ బాడీ ఎలక్షన్స్‌పై ముందుకు ఎలా

**వరంగల్ , శుభ తెలంగాణ :** అసెంబ్లీలో అయినా బయట అయినా తెలంగాణలో అధికార పార్టీపై విరుచుకుపడుతోంది ఎవరు అంటే... భారత రాష్ట్ర సమితి మాత్రమే. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, పార్లమెంట్ ఎన్నికల్లో సగానికిపైగా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడం, కేసీఆర్ ఫీల్డ్‌లోకి వచ్చేందుకు తటపటాయించడం, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీ మారడం వంటి ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా బీఆర్ఎస్ .. కాంగ్రెస్ పై పోరాటంలో ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎంత మంది చెబుతున్నా.. ఆ పార్టీ హైకమాండ్ మాత్రం.. పూర్వ వైభవం సాధిస్తామన్న నమ్మకంతోనే ఉన్నారు. క్యాడర్ కు ధైర్యం కల్పిస్తున్నారు. అయితే భవిష్యత్ తమదేనని బీఆర్ఎస్ పని అయిపోయిందని అనుకుటున్న బీజేపీ మాత్రం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో పెద్దగా కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రకరకాల కారణాలతో బీఆర్ఎస్ విరుచుకుపడుతోంది. ఆరు గ్యారంటీల అమలు దగ్గర నుంచి రుణమాఫీ వరకూ... శాంతి భద్రతల నుంచి పెట్టుబడుల వరకూ ప్రతి విషయంలోనూ సందు దొరికితే ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. కానీ తామే ప్రధాన ప్రతిపక్షమని..దానికి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్లే సాక్ష్యమని వాదిస్తున్న బీజేపీ నేతలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఎప్పుడో ఓ సారి ప్రెస్ మీట్ పెడతారు. ఆ ప్రెస్ మీట్ పెట్టారన్న సంగతి కూడా చాలా మందికి తెలియదు. రోడ్డు ఎక్కి పోరాడిన సందర్భాలు కూడా లేవు. ఉన్నా... ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా పోరాటాల విషయంలో బీజేపీ వెనుకబడిపోవడం ఆ పార్టీ క్యాడర్ కూడా ఆశ్చర్యపోతోంది. అయితే బీజేపీ ఏం చేసినా దానికో వ్యూహం ఉంటుందని ఆ పార్టీ కార్యకర్తలు గట్టిగా నమ్ముతున్నారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అని బీఆర్ఎస్ గురించి అంటున్నారు. అయితే బీజేపీలో అంతర్గత పోరాటాల వల్ల.. పార్టీ ముఖ్య నేతల మధ్య సఖ్యత లేకపోవడం వల్లనే పార్టీ నిస్తేజంగా మారిందని అనే వారు ఎక్కువగా ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. వీకెండ్స్ లో తప్ప పార్టీ కార్యక్రమాలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. ఈటల రాజేందర్ చొరవ తీసుకుని బాధ్యత తీసుకుంటే చాలా మంది సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. స్వయంగా బీఎల్ సంతోష్ వచ్చి పరస్థితుల్ని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఎంత వరకూ చక్కబెట్టారో ఎవరికీ తెలియదు. కానీ.. ఈ పోరాటం వల్ల మాత్రమే .. పార్టీ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదని ఎక్కువ మంది నమ్ముతున్నారు. మరో వైపు బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం లేదా, పొత్తులు ఖాయమన్న ప్రచారం కొంత కాలంగా జరుగుతోంది. అందులో ఎంత నిజముందో ఆ రెండు పార్టీల ముఖ్య నేతలకే తెలియాలి. కానీ ఆ ప్రచారం మాత్రం గట్టిగా సాగాలని వారు కోరుకుంటున్నారు. అందుకే విలీనం, పొత్తుల వార్తల్ని ఖండించడం లేదు. అసలు స్పందించడం లేదు. ఇలా ప్రచారం జరగడంతో బీజేపీ క్యాడర్ లో గందరగోళం ఏర్పడుతోంది. అలాంటి పరిస్థితే వస్తే.. ఎవరు ఎవరి మీద స్వారీ చేస్తారోనని కంగారు పడుతున్నారు. బీఆర్ఎస్ తో ఇలాంటి సమయంలో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా అది బీజేపీకి నష్టం చేస్తుంది కానీ.. లాభం చేసే అవకాశం లేదని వాదిస్తున్నారు. అయితే కింది స్థాయి క్యాడర్ మాటలు వినేవారు ఇప్పుడు ఎవరూ బీజేపీ లో లేరు.

# వీకెండ్ పిల్లలతో బయటకు వెళ్లండి



వీకెండ్స్ పిల్లలతో తల్లిదండ్రులు బయటకు వెళ్లేందుకు ప్లాన్ చేయాలని సూచిస్తున్నారు నిపుణులు. చిన్నారులకు మెమొరబుల్ ఈవెంట్స్ అందించాలని చెప్తున్నారు. బిజీ షెడ్యూల్స్, ఇంట్లో ఉంటే బాగుండనే ఆలోచన అవుటింగ్స్, ఫ్యామిలీ ఎక్స్‌కర్షన్స్‌ను అవాయిడ్ చేస్తే బాగుంటుందని అనిపించొచ్చు. కానీ వీకెండ్ వెకేషన్స్ తో బోలెడు లాభాలున్నాయని ... ఫాలో కావడమే బెటర్ అని అంటున్నారు. ఇవి పిల్లల ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతాయని చెప్తున్నారు. మన బిజీ వర్క్ షెడ్యూల్స్ ఫ్యామిలీతో నాణ్యమైన సమయాన్ని గడిపేందుకు అడ్డంకిగా మారుతాయి. కాబట్టి వీకెండ్ వెకేషన్ పిల్లలతో స్ట్రాంగ్ కనెక్షన్స్ డెవలప్ చేసుకునే అవకాశాన్ని ఇస్తున్నాయి. పార్క్, బీచ్, ఫారెస్ట్ టూర్స్, కిడ్స్ వరల్డ్ లాంటివి ట్రై చేయమని సూచిస్తున్నారు నిపుణులు. ఈ అనుభవాలు శాశ్వత జ్ఞాపకాలను సృష్టిస్తాయి. కుటుంబ బంధాలను బలోపేతం చేస్తాయి. తల్లిదండ్రులు పిల్లల మధ్య నమ్మకం, పరస్పర అవగాహన పెంపొందే అవకాశం ఉంది. అంతేకాదు పేరెంట్స్ తమ ఆనందానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పిల్లల్లో భద్రత, సొంతం అనే భావన ఏర్పడుతుంది. శారీరక ఆరోగ్యం: ప్రస్తుతం పిల్లలు మొబైల్స్ కు అలవాటు పడిపోయారు. స్కూల్ నుంచి వచ్చిందంటే చాలు ఫోన్, లాప్ టాప్, టీవీలకు అతుక్కుపోవడం, వీడియో గేమ్స్ ఆడటం మాత్రమే జరుగుతుంది. కానీ ఔట్ డోర్ గేమ్స్ అసలు ఇంపార్టెన్స్ ఇవ్వట్లేదు. దీనివల్ల శారీరక వ్యాయామం లేక ఊబకాయం, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరుతున్నాయి. ఫ్యాట్ పెరిగిపోయి గుండెపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. అలా కాకుండా బయటకు వెళ్తే హైకింగ్, బైకింగ్, స్పోర్ట్స్, వాకింగ్ లాంటివి శారీరక శ్రమను కలిగిస్తాయి. హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కండరాలను బలోపేతం చేయడంలో సహాయపడుతాయి. సహజ సూర్యరశ్మికి గురికావడం వల్ల ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పనితీరుకు అవసరమైన విటమిన్ డి అందుతుంది. విద్యాభివృద్ధి: పిల్లల ఎడ్యుకేషన్ పై కూడా విహారయాత్రలు పాజిటివ్ ఇంపాక్ట్ కలిగిస్తాయి. తాము పుస్తకాల్లో చదివిన పురాతన లేదా గొప్ప స్థలాలను నేరుగా సందర్శించడం ద్వారా ప్రాక్టికల్ గా తెలుసుకోగలరు. అలాంటి అనుభవం జీవితాంతం గుర్తుండిపోతుంది. సబ్జెక్ట్ పై మరింత ఇంట్రెస్ట్ పెరుగుతుంది. అందుకే మ్యూజియంలు, చారిత్రక ప్రదేశాలు, ప్రకృతి నిల్వలు, సాంస్కృతిక కార్యక్రమాల సందర్శనలు ఆకర్షణీయంగా సమాచారంతో కూడిన అభ్యాస అనుభవాలను అందిస్తాయి. జ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ఒత్తిడి దూరం: మోడ్రన్ లైఫ్ స్టైల్ పెద్దలతో పాటు పిల్లల ఒత్తిడికి కారణం అవుతుంది. కాబట్టి వీకెండ్స్ లో కొత్త ప్రాంతాల సందర్శన డెయిలీ రోటీన్ నుంచి బ్రేక్ తీసుకున్నట్లు ఉంటుంది. ప్రశాంతతను అందిస్తుంది. ప్రకృతి విహారయాత్రలు ముఖ్యంగా ఒత్తిడి, ఆందోళన, నిరాశ భావాలను తగ్గిస్తాయి. స్వచ్ఛమైన గాలి మానసిక శ్రేయస్సును మెరుగుపరుస్తుంది. సాహసాలను ఆస్వాదించడం మొదలుపెడతారు.

# వర్షాకాలంలో ఆరెంజ్ జ్యూస్ తాగుతున్నారా?

ఆరెంజ్ జ్యూస్‌లో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. శ్వాసకోశ ఇబ్బందులను కూడా తగ్గించగలదు. ఇన్?ఫెక్షన్లు ఎక్కువగా వచ్చే వానాకాలంలో ఆరెంజ్ జ్యూస్ రెగ్యులర్‌గా తాగడం మంచిది.నారింజ జ్యూస్?లో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. కణాలను ర్యాడికల్ డ్యామేజ్ నుంచి ఇవి సంరక్షిస్తాయి. గుండె వ్యాధులు లాంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే రిస్క్‌ను నారింజ తగ్గించగలదు. ఆరెంజ్‌లో పొటాషియం, ఫోలేట్ అధిక పరిమాణంలో ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించేందుకు సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. దీంతో పాటు గుండె సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. ఇవే కాకుండా ఇందులో శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు కూడా లభిస్తాయి. ఆరెంజ్ రసంలో ఫ్లేవోన్స్ అధికంగా ఉంటాయి. ఇది మెదడు పనితీరును మెరుగుపరచగలవు. జ్ఞాపకశక్తిని కూడా ఎక్కువ చేయగలదు.నారింజలోని విటమిన్ సీ శరీరంలో కొలేజెన్ ఉత్పత్తిని పెంచగలదు. చర్మ ఆరోగ్యానికి ఇది చాలా మేలు చేస్తుంది. ఎముకలు, కండరాల దృఢత్వాన్ని కూడా మెరుగుపరచగలదు. ఆరెంజ్ జ్యూస్?లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో జీర్ణవ్యవస్థకు ఇది మేలు చేస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమయ్యేందుకు ఈ జ్యూస్ సహకరిస్తుంది. బరువు తగ్గేందుకు కూడా తోడ్పడుతుంది.ఆరెంజ్ జ్యూస్‌లో అధిక మొత్తంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా చేసేందుకు ఎంతగానో సహాయపడుతుంది. దీంతో పాటు చర్మంపై ఉన్న ముడతలు, మచ్చలు సులభంగా తొలగిపోతాయి. అంతేకాకుండా చర్మం కూడా మెరిసేలా అందంగా కనిపిస్తుంది.



ఆరెంజ్ జ్యూస్‌లో ఉండే అధిక ఫైబర్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దీని కారణంగా మలబద్ధకం, జీర్ణక్రియ సమస్యల నుంచి విముక్తి కలుగుతుంది. అంతేకాకుండా పొట్ట నొప్పుల నుంచి విముక్తి కలుగుతుంది.

# ఈ ఒక్క ఆకుతో శరీరంలోని తిప్పలన్నీ దూరం..

మన చుట్టూ ఉన్న ప్రకృతిలో ఎన్నో రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి.. ఇవి అనేక సమస్యలను తీర్చే సహజ ఔషధాలుగా పనిచేస్తాయి.. అలాంటి వాటిలో తిప్పతీగ ఒకటి.. తిప్పతీగను ఆయుర్వేదంలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. తిప్పతీగను ఉపయోగించి జ్యూస్, పౌడర్, క్యాప్సుల్స్ తయారుచేస్తారు. దీనిని ఎలా తీసుకున్నా శరీరానికి మంచిదే.. దీని ఆకుల నుంచి కాండం, వేర్లను కూడా తీసుంటారు.. అందుకే.. తిప్పతీగను తిరుగులేని ఔషధ మొక్కగా పేర్కొంటారు.. ఒక్క తిప్పతీగ.. ఒంట్లో ఉన్న తిప్పలన్నీ దూరం చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతుంటారు.. అందుకోసమే తిప్పతీగ మూలికను అమృతం అంత శక్తివంతమైనదిగా పరిగణిస్తారు. దీన్ని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు నయమవుతాయి. ఈ తీగ కాండం, ఆకు, వేరు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. తిప్పతీగను ప్రాచీన కాలం నుండి ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తున్నారు. తిప్పతీగను తీసుకోవడం వల్ల కలిగే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. తిప్ప తీగలో కనిపించే అద్భుతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు తరచుగా దగ్గు, జలుబు, టాన్సిలిటిస్ వంటి ఏవైనా సాధారణ శ్వాసకోశ సమస్యలతో పోరాడటానికి సహాయపడతాయి. జలుబు, దగ్గు మాత్రమే కాకుండా, ఇది ఉబ్బసం రోగులకు కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఛాతీ బిగుతుగా ఉండడం, శ్వాస ఆడకపోవడం, దగ్గు, గురక వంటి లక్షణాలను తిప్పతీగ తగ్గిస్తుంది.

తిప్పతీగ రసం తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. ఇది శరీరానికి శక్తిని అందిస్తుంది. శరీరం మూలకాలను మెరుగుపరచడానికి, పోషించడానికి సహాయపడుతుంది. మధుమేహం, చర్మవ్యాధులు, కొన్ని కీళ్ల వ్యాధులు, నులిపురుగులు, జ్వరం, దగ్గు మొదలైన వాటి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.తిప్పతీగ వేర్లు, త్రిఫల చూర్ణం కలిపి కషాయాలను తయారు చేసి, తేనెతో కలిపి, క్రమం తప్పకుండా



తీసుకుంటే కంటి చూపు మెరుగుపడుతుంది. తిప్పతీగ ఆకులతోపాటు బెల్లం కలిపి సేవిస్తే మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. 10-20 మిల్లీలీటర్ల తిప్పతీగ రసాన్ని రోజుకు 3 సార్లు తాగితే చర్మవ్యాధుల నుండి ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు దీనిని తీసుకోవడం వల్ల శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి.. ఉబ్బసం దూరమవుతుంది.. తిప్పతీగ జ్యూస్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. తిప్పతీగ శరీరంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపర్చి అనేక వ్యాధులను నియంత్రిస్తుంది.

# పసుపు దంతాలతో ఇబ్బందిపడుతున్నారా?



తెల్లటి ముత్యాల్లాంటి దంతాలు ఉండాలని అందరూ కోరుకుంటారు. కానీ, కొందరికీ పళ్లు పసుపు పచ్చగా మారుతుంటాయి. ఇలాంటి పళ్ల కారణంగా వారు నలుగురిలో నవ్వడానికి కూడా వెనుకాడతారు. మనం తినే ఆహారాలు, తాగే పానీయాలు, వయస్సు కారణంగా దంతాల సమస్యలకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. అయితే, పళ్లపై పేరుకుపోయిన పసుపు రంగును తొలగించడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా కూడా ఎలాంటి లాభం ఉండదు. కానీ, ఇంట్లో లభించే కొన్ని పదార్థాలు ఉపయోగించడం వల్ల మీ దంతాలు తెల్లగా ముత్యాల్ల మెరుస్తాయి. అంతేకాదు.. చిగుళ్లు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. అలాంటి పదార్థాలేవో ఇక్కడ తెలుసుకుందాం..

ఉప్పు..ఉప్పును ఉపయోగించి పళ్లపై పేరుకుపోయిన మరకలను తొలగించుకోవచ్చు .ఇందుకోసం కొద్దిగా ఉప్పు వేలితో తీసుకుని దంతాలను తోముకోవడం వల్ల పసుపు రంగు తొలగిపోయి తెల్లని రంగు వస్తుంది. సుమారు 1-2 నిమిషాలు ఉప్పుతో మీ దంతాలను బ్రష్ చేయండి. అంతేగానీ, పళ్లను గట్టిగా రుద్దకుండా జాగ్రత్తగా తోముకోవాలి.. ఎందుకంటే ఎక్కువ గట్టిగా బ్రష్ చేయడం వల్ల పంటి ఎనామిల్, చిగుళ్లు దెబ్బతింటాయి. బ్రష్ చేసిన తర్వాత మీ నోటిని నీటితో బాగా కడగాలి. ఇలా రోజూ చేయడం వల్ల దంతాలకు రంగు వస్తుంది. కొబ్బరి నూనె పుల్లింగ్ కూడా నోటిని శుభ్రపరుస్తుంది. చిగుళ్ళ ఆరోగ్యానికి మంచిది. పుసుపు దంతాలు తెల్లగా మారుతాయి. మీ నోటిలో నూనె పోసుకున్న తర్వాత, 10-20 నిమిషాల పాటు పుక్కిల్లించాలి.. ఇది నోటిలోని అన్ని భాగాలకు చేరేలా చూసుకోవాలి. ఇందుకోసం మంచి స్వచ్ఛమైన కొబ్బరి నూనెను మాత్రమే ఉపయోగించాలి.యాపిల్ సైడర్ వెనిగర్ కూడా చిగుళ్ల పరిశుభ్రత, పసుపు దంతాలను తొలగించి తెల్లబడటంలో సహాయపడటానికి సహజ మౌత్ వాష్‌గా ఉపయోగించవచ్చు. రోజుకు రెండుసార్లు ఆపిల్ సైడర్ వెనిగర్ నీటితో మీ నోటిని శుభ్రం చేసుకోండి. ఇది నోటిలో బ్యాక్టీరియా పెరుగకుండా కాపాడుతుంది. దంతాలను తెల్లగా మార్చడంలో సహాయపడేందుకు బేకింగ్ పౌడర్, నిమ్మరసం కూడా ఉపయోగపడుతుంది. ఈ రెండింటినీ కొద్దిగా తీసుకుని దంతాల మీద బాగా రుద్ది 10 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత కడగాలి. ఇది దంతాల రంగును తెల్లగా మార్చేయడానికి సహాయపడుతుంది.

# వాక్కాయ దొరికితే అస్సలు వదలకండి

వాక్కాయలు లేత గులాబీ రంగులో పుల్లగా ఉంటాయి. చాలా ప్రాంతాలలో వీటితో పచ్చడి, పప్పు వంటి వంటకాలు చేస్తుంటారు. అడవి ప్రాంతాలలో వాక్కాయ చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. చాలా మందికి వాక్కాయలతో వంటలు చేస్తారని తెలుసు కానీ వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియదు. అవేంటో తెలిస్తే వాక్కాయలు ఎక్కడ కనిపించినా వాటిని వదలలాని అనిపించదు. వాక్కాయలలో విటమిన్ సి కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది, దీని వల్ల ఇన్ఫెక్షన్లు వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువగా ఉండే ఇన్ఫెక్షన్ల నుండి దూరంగా ఉండాలంటే వాక్కాయలను తప్పనిసరిగా తినాలి. ఫైబర్ ఉన్న పండ్లు, కూరగాయలు జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. వాక్కాయలలో కూడా ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది, ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది.వాక్కాయలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మంటను తగ్గించడంలో, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం సేఫ్ గా ఉంటుంది.వాక్కాయలలో విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఎదుర్కుంటాయి. చర్మానికి ఆరోగ్యకరమైన మెరుపును ఇస్తాయి. చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా వాక్కాయలు మెరుగ్గా పనిచేస్తాయి. మధుమేహం ఉన్నవారు వాక్కాయలతో చేసిన ఆహార పదార్థాలు తింటూ ఉంటే మంచి ఫలితాలు ఉంటాయి.వాక్కాయను యాపిల్, నారింజ, లేదా నీటితో అయినా సరే కలిపి జ్యూస్ తయారుచేసుకుని తాగితే మంచిది. ఇది శరీరానికి పోషకాలనే కాదు.. మంచి రిఫ్రెష్మెంట్ కూడా ఇస్తుంది. వాక్కాయలు ఎల్లప్పుడూ అందుబాటులో లేని వారు వాక్కాయలను ఎండించి పొడి చేసుకుని వాటిని కూరల్లోనూ, పులుసు తయారీలోనూ జోడించవచ్చు. ఇది కూరకు అదనపు రుచిని ఇవ్వడమే కాకుండా వాక్కాయ నుండి లభించే ఫలితాలు లభిస్తాయి.



Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110